సాక్షి సూర్యాపేట

మంగళవారం । 22 । ఆగస్టు । 2023



ప్రజలే బుద్ధి చెబుతారు

అవకాశవాదులకు ప్రజలే బుద్ధి చెబుతారని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. - 10లో



బుద్ధవనం..బౌద్ధ ప్రపంచం

నాగార్జునసాగర్‌లో నిర్మించిన బుద్ధవనం.. ఒక బౌద్ధ ప్రపంచమని శ్రీలంక దేశీయులు కొనియాడారు. - 10లో



అందరికీ విద్య..

అందరికీ విద్య అందించడమే ఓపెన్ స్కూల్ లక్ష్యమని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ జగదీష్‌కుమార్ అన్నారు. - 10లో

• పేటలో మృణాల్ ఠాకూర్




సూర్యాపేటలో సోమవారం సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి సినీనటి, సీతారామం ఫేమ్ మృణాల్ ఠాకూర్ వచ్చారు. ఆమెను చూసేందుకు అభిమానులు, ప్రజలు భారీగా తరలివచ్చారు.

12 నియోజకవర్గాల్లో పాతవారికే..

సిట్టింగ్‌లకే టికెట్లు

ఎన్నికల పోరుకు బీఆర్‌ఎస్ దళం రెడీ..

- స్థానికంగా పార్టీలో వ్యతిరేకత ఉన్నా .. ప్రస్తుత ఎమ్మెల్యేలకే అవకాశం
- సర్దుకుపోవాలని కేసీఆర్ దిశానిర్దేశం
- పార్టీలో ఉంటే అవకాశాలు వస్తాయని స్పష్టీకరణ
- అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచన



పోటీలో ఉండే అభ్యర్థులు వీరే..

సూర్యాపేట - మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి
తుంగతుర్తి - గాదరి కిషోర్‌కుమార్
కోదాడ - బొల్లం మల్లయ్యయాదవ్
హుజూర్‌నగర్ - శానంపూడి సైదిరెడ్డి
నల్లగొండ - కంచర్ల భూపాల్‌రెడ్డి
మిర్యాలగూడ - నలమోతు భాస్కర్‌రావు
నకిరేకల్ - చిరుమర్తి లింగయ్య
మునుగోడు - కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి
నాగార్జునసాగర్ - నోముల భగత్
దేవరకొండ - రమావత్ రవీంద్రకుమార్
ఆలేరు - గొంగిడి సునీత
భువనగిరి - పైళ్ల శేఖర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ టికెట్లు పాత అభ్యర్థులకే దక్కాయి. సీఎం గతంలో చెప్పినట్లుగా సిట్టింగ్‌లకే మళ్లీ పోటీచేసే అవకాశం కల్పించారు. కొన్ని నియోజకవర్గాల్లో సొంత పార్టీ నుంచే అభ్యర్థుల పట్ల వ్యతిరేకత ఉన్నా అవేమీ పట్టించుకోకుండా పాత వారికే టికెట్లను కేటాయించారు. సోమవారం అభ్యర్థుల ప్రకటన సందర్భంగా సీఎం కేసీఆర్ స్పష్టమైన ప్రకటన చేశారు. పార్టీ ప్రకటించిన అభ్యర్థులను గెలిపించుకోవాలని, పార్టీలో ఉంటే అవకాశాలు వస్తాయని చెప్పారు.

ఫిర్యాదులను పట్టించుకోకుండా..

ఉమ్మడి జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో ప్రస్తుత ఎమ్మెల్యేలపై సొంత పార్టీకి చెందిన స్థానిక నేతల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. సిట్టింగ్‌లకు టికెట్లు ఇస్తే తాము పనిచేయబోమని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినా సీఎం కేసీఆర్ అవేమీ పట్టించుకోకుండా పాతవారికే టికెట్లు ఖరారు చేశారు. దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌పై దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, దేవేందర్‌నాయక్ తదితర నేతలు ఇటీవల మంత్రి హరీష్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ఆయనకు టికెట్ ఇస్తే తాము సహకరించబోమని స్పష్టంగా చెప్పారు. నియోజకవర్గంలో నాయకులను పట్టించుకోరని, ఏకపక్ష పోకడలు ఉంటాయని, ఈసారి మరొకరికి టికెట్ ఇవ్వాలని కోరారు. డిండిలోనూ సమావేశం పెట్టుకొని రవీంద్రకుమార్‌కు టికెట్ ఇవ్వొద్దని తీర్మానించారు. కోదాడలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కూడా స్థానికంగా పార్టీ నేతలను పట్టించుకోవడం లేదని, ఆయనకు టికెట్ ఇవ్వొద్దని నియోజకవర్గ నేతలు శశిధర్‌రెడ్డి వర్గం నాయకులు ప్రత్యేకంగా సమావేశాలు పెట్టి తీర్మానం కూడా చేశారు. నాగార్జునసాగర్‌లో హాలియా, నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌ల ఎంపిక విషయంలో విభేదాలు తలెత్తాయి. ఎమ్మెల్సీ కోటిరెడ్డి చెరొకటి తమ అనుచరులకు ఇచ్చుకుందామని ప్రతిపాదన పెట్టినా ఎమ్మెల్యే భగత్ అందుకు ఒప్పుకోలేదని, రెండు చోట్ల తన వర్గం వారినే చైర్మన్లుగా నియమించుకున్నారనే కోపంతో ఎమ్మెల్సీ కోటిరెడ్డి వర్గం ఎమ్మెల్యే వర్గాన్ని పూర్తిస్థాయిలో వ్యతిరేకిస్తూ వస్తోంది. ఇవేమీ పట్టించుకోకుండా సీఎం కేసీఆర్ తాను మొదట చెప్పిన విధంగానే సిట్టింగ్‌లకే టికెట్లను ప్రకటించారు.

పార్టీలో ఉంటేనే అవకాశాలు

బీఆర్‌ఎస్ పార్టీ విశాలమైందని, ఎమ్మెల్యే టికెట్ ఒక్కటే కాదు పార్టీలో ఉంటే ఎన్నో అవకాశాలు వస్తాయని సీఎం స్పష్టం చేశారు. అందరూ కలిసి పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. పనిచేసుకుంటూ పోతే అవకాశాలు వస్తాయని, ఎవరూ తొందరపడి నిర్ణయాలు తీసుకొని ఆగం కావొద్దని సూచించారు. అయితే, ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నందున అసమ్మతిని తొలగించుకునేందుకు అభ్యర్థులు ప్రయత్నిస్తే అసమ్మతి నేతలు కూడా కలిసి వచ్చే అవకాశం ఉంది.



మద్దిరాలలో బాణసంచా కాల్చి సంబురాలు చేసుకుంటున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు

ఆరుగురికి మూడోసారి టికెట్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆరుగురు అభ్యర్థులకు మూడోసారి అవకాశం కల్పించారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత మొదటిసారి 2014లో ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సూర్యాపేట నియోజకవర్గం నుంచి ఉద్యమ నాయకుడు, కేసీఆర్‌కు అత్యంత నమ్మకస్తుడైన గుంటకండ్ల జగదీష్‌రెడ్డికి అవకాశం కల్పించారు. వరుసగా మూడు సార్లు టికెట్ కేటాయించారు. రెండు సార్లు వరుసగా విజయం సాధించిన జగదీష్‌రెడ్డికి మంత్రి పదవి ఇచ్చారు. తెలంగాణ మొదటి విద్యాశాఖ మంత్రిగా, తరువాత విద్యుత్ శాఖ మంత్రిగా ఉన్నారు. ప్రస్తుతం మూడోసారి పోటీలో నిలువబోతున్నారు. విద్యార్థి నాయకుడైన గాదరి కిషోర్‌కుమార్‌కు గత రెండు ఎన్నికల్లోనూ అవకాశం కల్పించగా రెండు సార్లు విజయం సాధించారు. ప్రస్తుతం మూడోసారి పోటీ చేయబోతున్నారు.

- మిర్యాలగూడలో వరుసగా మూడోసారి ఎమ్మెల్యే భాస్కర్‌రావుకు అవకాశం కల్పించారు. ఇప్పటికే ఆయన రెండు సార్లు విజయం సాధించారు.
- మునుగోడు నియోజకవర్గంలో కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి కూడా 2014 ఎన్నికల్లో విజయం సాధించారు. 2018లో ఓడిపోయారు. అప్పట్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రాజీనామాతో ఉప ఎన్నికలు వచ్చాయి. ఆ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి రెండోసారి గెలుపొందారు. ప్రస్తుతం మూడోసారి ఆయన పోటీలో నిలువబోతున్నారు.
- ఆలేరు నియోజకవర్గం నుంచి గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి కూడా గత రెండు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున గెలుపొందారు. ప్రస్తుతం మూడోసారి ఆమె పోటీలో ఉండబోతున్నారు.
- భువనగిరి నియోజకవర్గం నుంచి పైళ్ల శేఖర్‌రెడ్డి రెండుసార్లు విజయం సాధించారు. మూడోసారి ఆయనకే టికెట్ కేటాయించారు.

రెండోసారి చాన్స్ వీరికే..

నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ బీఆర్‌ఎస్ తరఫున 2018 ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన వారే.

- నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ తండ్రి నోముల నర్సింహయ్య అకాల మరణంతో వచ్చిన ఉప ఎన్నికలో భగత్‌కే అవకాశం కల్పించగా విజయం సాధించారు. రాబోయే ఎన్నికల్లో రెండోసారి ఆయనకు పార్టీ అధినేత టికెట్ ఖరారు చేశారు.

బీఆర్‌ఎస్ నుంచి చిరుమర్తి మొదటిసారి..

నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కాంగ్రెస్ నుంచి గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇప్పుడు ఆయన బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మొదటిసారి పోటీలో ఉండబోతున్నారు.

న్యూస్‌రీల్

అర్జీలపై సత్వరమే స్పందించాలి



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వెంకట్రావు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నూతన కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు సీహెచ్ ప్రియాంక, వెంకట్‌రెడ్డిలతో కలసి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన కలెక్టరేట్‌లో కేటాయించిన శాఖల వారీగా వీలైనంత త్వరగా కార్యాలయాలను సత్వరమే మార్చాలని అధికారులకు సూచించారు. భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు 32, ఇతర శాఖలకు సంబంధించి 6 దరఖాస్తులు మొత్తం 38 దరఖాస్తులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సురేష్, పీడీ కిరణ్ కుమార్, సీపీఓ వెంకటేశ్వర్లు, డీఏఓ రామారావు నాయక్, డీహెచ్ఓ శ్రీధర్ గౌడ్, డీఈఓ అశోక్, సంక్షేమ అధికారులు జ్యోతిపద్మ, అనసూర్య, శంకర్, శిరీష, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైకుంఠధామాల్లో వసతులు కల్పించాలి

గ్రామాల్లోని వైకుంఠధామాల్లో వసతులు కల్పించాలని కలెక్టర్ వెంకట్రావు అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్ ప్రియాంక, వెంకట్‌రెడ్డిలతో కలిసి జిల్లా అధికారులు, ఎంపీడీఓలతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వైకుంఠధామానికి తప్పనిసరిగా నీటివసతి, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యాలను గ్రామపంచాయతీ నుంచి వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని గ్రామాల్లో పోలింగ్‌స్టేషన్ల వారీగా ఓటర్ల జాబితా ప్రచురించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్, జెడ్పీసీఈఓ సురేష్, డీపీఓ యాదయ్య ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆశావహులకు నిరాశ!

- టికెట్ దక్కకపోవడంతో భవిష్యత్‌పై సమాలోచనలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి జిల్లాలో ఆశావహులకు బీఆర్‌ఎస్ మొండిచేయి చూపింది. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో కొంత కాలంగా ఆశావహులు టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తూ వస్తున్నారు. స్థానికంగా ఉన్న పరిస్థితులను బట్టి తమకు టికెట్ ఇస్తారని, పెద్దల ఆశీస్సులు ఉన్నాయంటూ చెప్పుకున్నారు. కొందరు ఫౌండేషన్ల ద్వారా ప్రజల్లోకి వెళ్లగా, మరికొందరు సాధారణంగానే ప్రయత్నాలు చేసుకున్నారు. అయినా సోమవారం ప్రకటించిన జాబితాలో సిట్టింగ్‌లకే టికెట్లను కేటాయించడంతో ఆశావహులకు నిరాశ తప్పలేదు.

- నల్లగొండలో కౌన్సిలర్ పిల్లి రామరాజు యాదవ్ ఆర్‌కేఎస్ ఫౌండేషన్ పేరుతో కొంత కాలంగా ప్రజల్లోకి వెళ్తున్నారు. టికెట్ కోసం ప్రయత్నిస్తూ వచ్చారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్ రెడ్డి కూడా ఈసారి అవకాశం ఇస్తే తాను పోటీ చేస్తానని ప్రకటించారు. సోమవారం ప్రకటించిన జాబితాలో మాత్రం సిట్టింగ్ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డికే స్థానం కల్పించారు.
- మునుగోడు నియోజకవర్గంలోనూ కర్నాటి విద్యాసాగర్, బోళ్ల శివశంకర్, నారబోయిన రవి టికెట్ ఆశించారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు అమిత్‌రెడ్డి మునుగోడు టికెట్ ఆశించి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అయినా, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అభ్యర్థిత్వాన్నే కేసీఆర్ ఖరారు చేశారు. దీంతో అక్కడ ఆశావహులకు భంగపాటు తప్పలేదు.
- నాగార్జునసాగర్‌లో కూడా అదే పరిస్థితి నెలకొంది. ఓ. బుసిరెడ్డి ఫౌండేషన్ పేరుతో బుసిరెడ్డి పాండురంగారెడ్డి, మన్నెం రంజిత్ యాదవ్, కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు టికెట్ ఆశించి సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యమంత్రి మాత్రం నోముల భగత్‌కే టికెట్ ఖరారు చేశారు.
- దేవరకొండలో దేవేందర్ నాయక్, కోదాడలో శశిధర్‌రెడ్డికి కూడా భంగపాటు తప్పలేదు. నకిరేకల్‌లో మాజీ ఎమ్మెలే వేముల వీరేశం కూడా టికెట్ ఇస్తారన్న ఆశతో ఉన్నా నిరాశే మిగిలింది.

కమ్యూనిస్టుల దారెటు?

- కూసుకుంట్లకే మునుగోడు టికెట్
- పొత్తు ఉంటే.. మునుగోడు వస్తుందని ఆశించిన సీపీఐ
- మిర్యాలగూడపై సీపీఎం ఆశలు
- ఇవేవీ లేవని తేల్చిన సీఎం కేసీఆర్



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లాలో కమ్యూనిస్టు, బీఆర్‌ఎస్ పార్టీలు వచ్చే సాధారణ ఎన్నికల్లో పొత్తు పెట్టుకుంటాయని అంతా భావించినా అది కుదరలేదు. తమకు అవకాశం వస్తుందని భావించిన నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించడంతో అంచనాలు తలకిందులయ్యాయి. మునుగోడు ఉప ఎన్నికలో కమ్యూనిస్టు పార్టీతో బీఆర్‌ఎస్ జత కట్టింది. ఆ సందర్భంలోనే.. వచ్చే ఎన్నికల్లోనూ కలిసే పనిచేస్తామని ఇరుపార్టీల నేతలు ప్రకటించారు. నిన్నటి వరకు కూడా కమ్యూనిస్టులు, బీఆర్‌ఎస్ పొత్తు పెట్టుకుంటాయని అంతా అనుకున్నారు. కానీ, కమ్యూనిస్టులు అడిగే స్థానాల్లోనూ బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించడంతో పొత్తు లేనట్లేనని తేలిపోయింది.

కామ్రేడ్ల పొత్తు ఎవరితో..

దేశంలోనే ఎప్పుడూలేని విధంగా మునుగోడు ఉప ఎన్నిక పోటాపోటీగా జరిగింది. ఇందులో కమ్యూనిస్టు పార్టీలు బీఆర్‌ఎస్‌తో పొత్తు పెట్టుకున్నాయి. ఇక ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలతో పాటు కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులతో సహా ఉప ఎన్నికల ప్రచారానికి వచ్చారు. ప్రధానంగా బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థుల మధ్యనే పోటీ జరిగింది. ఈ రెండు పార్టీలు యుద్ధాన్ని తలపించేలా ప్రచారం కొనసాగించాయి. మొత్తానికి ఆ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విజయం సాధించారు. ఈ సందర్భంలోనే కమ్యూనిస్టుల పొత్తుతోనే విజయం సాధించినట్లు బీఆర్‌ఎస్ ప్రకటించింది. భవిష్యత్తులోనూ ఎన్నికల్లో కలిసే పనిచేస్తామని ప్రకటించింది. ఆ తరువాత పొత్తుల్లో భాగంగా స్థానాల కేటాయింపుపై అంచనాలు పెరిగిపోయాయి. మునుగోడు ఎలాగైనా సీపీఐకి వస్తుందని అంచనా వేసుకున్నారు. లేదంటే మిర్యాలగూడను సీపీఎంకు కేటాయిస్తారని ఆ పార్టీ భావించింది. గతంలో సీపీఎం నుంచి జూలకంటి రంగారెడ్డి అక్కడ నుంచి గెలుపొందారు. దీంతో ఆ స్థానంపై సీపీఎం ఆశ పెట్టుకుంది. కొద్ది రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం, సీపీఐలకు ఒకటి చొప్పున టికెట్ ఇస్తారని, సీపీఎంకు భద్రాచలం, సీపీఐకి మునుగోడు ఇస్తారన్న చర్చ సాగింది. అయితే సోమవారం సీఎం కేసీఆర్ ప్రకటించిన జాబితా ప్రకారం పొత్తు లేదని తేల్చేశారు. మిర్యాలగూడలో సిట్టింగ్ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్ రావుకు, మునుగోడులో సిట్టింగ్ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి బరిలో ఉంటారని ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో కమ్యూనిస్టులు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకుంటారా? సొంతంగా పోటీ చేస్తారా? అన్నది తేలాల్సి ఉంది.

అడిషనల్ ఎస్పీ బాధ్యతల స్వీకరణ



అడిషనల్ ఎస్పీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్పీ, డీఎస్పీలు, సీఐలు

సూర్యాపేట క్రైం: నూతన జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆయనను సీట్లో కూర్చోబెట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్యాలయంలో పోలీసు అధికారులతో ఎస్పీ సమావేశం నిర్వహించారు. అనంతరం పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈమేరకు 8 మంది నుంచి ఫిర్యాదులు వచ్చాయి. ఎస్పీ ఫిర్యాదులను పరిశీలించారు. తక్షణమే చర్యలు తీసుకుని, బాధితులకు భరోసా కల్పించాలని ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు.

కేసీఆర్ నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేట: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్‌ఎస్ స్ఫూర్తిని కొనసాగిస్తూ, 12 స్థానాల్లో గులాబీ జెండా ఎగురవేసి సీఎం కేసీఆర్ నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ తరఫున సూర్యాపేట అభ్యర్థిగా మూడవసారి తనకు అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాజకీయాల్లో టికెట్లు ఆశించడం తప్పు కాదని, రానివారు నిరాశపడవద్దన్నారు. వచ్చిన వారు తమ సహచర నేతలను కలుపుకొని పనిచేసి పార్టీ, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఉమ్మడి జిల్లాలోని 12స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు మరోసారి గెలిచి కేసీఆర్ వద్దకు వెళ్తామన్నారు. అనంతరం 'సాక్షి'తో మాట్లాడుతూ 2001లో కేసీఆర్‌తో తెలంగాణ ఉద్యమంలో కలిసి పనిచేశాను తప్ప ఏ రోజు పదవుల కోసం పనిచేయలేదన్నారు. 2014 ఎన్నికల్లో కేసీఆర్ చెప్పడంతోనే తాను సూర్యాపేట ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందానన్నారు. 2014 సభలో తనను ఎమ్మెల్యేగా గెలిపించి పంపిస్తే మంత్రిగా చూస్తారని సీఎం కేసీఆర్ చెప్పారని, అదే విధంగా తనను ఆశీర్వదించారని తెలిపారు. సూర్యాపేట పట్టణ ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని, మూడోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేసుకుందామని పేర్కొన్నారు.

ఓటర్లు.. 9,37,185 మంది

- ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించిన ఎన్నికల సంఘం
- ఓటర్లలో 4,62,646 మంది పురుషులు, 4,71,731 మంది స్త్రీలు



దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లా ఓటర్ల సంఖ్య పెరిగింది. సోమవారం రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 9,37,185 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 4,62,646 మంది పురుషులు, 4,71,731 మంది స్త్రీలు, 29 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. అత్యధికంగా తుంగతుర్తి, హుజూర్‌నగర్‌లో 2,40,104 మంది ఓటర్లు, అత్యల్పంగా సూర్యాపేట నియోజకవర్గంలో 2,26,571 మంది ఓటర్లు ఉన్నారు.

పెరిగిన ఓటర్లు...

జిల్లాలో గత జనవరిలో ప్రకటించిన ఓటర్ల సంఖ్య కంటే సోమవారం ప్రకటించిన ఓటర్ల జాబితాలో ఓటర్లు పెరిగారు. జిల్లా అధికారులు ఓటరు నమోదుపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో భారీగా దరఖాస్తు చేసుకున్నారు. గత జనవరిలో ప్రకటించిన ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 9,14,668 మంది ఓటర్లు ఉండగా, తాజా జాబితాలో 8,33,846 మంది ఓటర్లు నమోదుకాగా.. 22,517 ఓట్లు పెరిగాయి. ఇదిలా ఉండగా.. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు జిల్లాలో అధికంగా ఉన్నాయి.

జనవరి 4న తుది ఓటరు జాబితా..

2024 జనవరి 4న రాష్ట్ర ఎన్నికల కమిషన్ తుది ఓటర్ల జాబితాను ప్రచురించనుంది. సోమవారం ప్రకటించిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో పేరు నమోదు కాని వారితో పాటు, మార్పులు చేర్పులకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదుకు అవకాశం ఉంది.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు ఇలా..

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో 9,37,185 మంది ఓటర్లు ఉన్నారు. సూర్యాపేట నియోజకవర్గంలో 2,26,571 మంది ఓటర్లు ఉండగా 1,11,657 మంది పురుష ఓటర్లు, 1,14,910 మంది స్త్రీ ఓటర్లు, నలుగురు ఇతర ఓటర్లు ఉన్నారు. కోదాడ నియోజకవర్గంలో 2,30,406 మంది ఓటర్లు ఉండగా 1,13,333 మంది పురుషులు, 1,17,062 మంది స్త్రీలు 11 మంది ఇతరులు ఉన్నారు. తుంగతుర్తి నియోజకర్గంలో 2,40,104 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,21,058 మంది పురుష ఓటర్లు, 1,19,039 మంది స్త్రీలు, ఏడుగురు ఇతరులు ఉన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 2,40,104 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,16,598 మంది పురుష ఓటర్లు, 1,20,720 మంది స్త్రీలు, ఏడుగురు ఇతర ఓటర్లు ఉన్నారు.

మద్యం షాపులకు ముగిసిన డ్రా

- కలెక్టర్, అదనపు కలెక్టర్ సమక్షంలో 99 దుకాణాల కేటాయింపు

సూర్యాపేట క్రైం: 2023–25 సంవత్సరానికి జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ సోమవారం ముగిసింది. జిల్లాలోని 99 మద్యం దుకాణాలకు ఈనెల 4 నుంచి 18 వరకు 4,323 దరఖాస్తులు రాగా. సోమవారం జిల్లా కేంద్రంలోని త్రివేణి ఫంక్షన్‌హాల్‌లో కలెక్టర్ వెంకట్రావ్, అదనపు కలెక్టర్ ప్రియాంక సమక్షంలో లక్కీ డ్రా తీశారు. దరఖాస్తుదారులు ఉదయం 10 గంటలకు ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకున్నారు. తాళ్లగడ్డ నుంచి మెడికల్ కళాశాల వరకు రోడ్లకిరువైపులా వాహనాలు నిలపడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన డ్రా ప్రక్రియ సాయంత్రం 6గంటల వరకు కొనసాగింది. మొదటగా సూర్యాపేట పట్టణంలోని జేజేనగర్ పరిధిలో ఉన్న మద్యం షాపునకు డ్రా తీశారు. చివరగా హుజూర్‌నగర్ పరిధిలోని మద్యం దుకాణానికి డ్రా తీశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనిత, తదితర ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.



మద్యం దుకాణాలకు డ్రా తీస్తున్న కలెక్టర్

తీవ్ర ఉత్కంఠ..

ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన డ్రాలో తమ పేరు ఉంటుందో లేదోనని దరఖాస్తుదారుల్లో నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది. మద్యం షాపు దక్కిన వారు సంతోషంతో అక్కడే కేక్ కటింగ్ చేశారు. దక్కని వారు బాధతో వెనుతిరిగారు. ఎక్కువగా రియల్ ఎస్టేట్ వ్యాపారులే దరఖాస్తు చేసుకున్నారు. రియల్ వ్యాపారం సరిగా లేకపోవడంతో.. మద్యం వ్యాపారంపై ఆసక్తి చూపినట్లు తెలుస్తోంది. కాగా.. మద్యం దుకాణాలకు సిండికేట్‌గా ఏర్పడి టెండర్లు వేశారు. 20 మంది నుంచి 30 మంది కలిసి సుమారు 30 నుంచి 40 దరఖాస్తులు చేసుకున్నారు.

దంపతులకు తగిలిన లక్కు..

మద్యం దుకాణాల కేటాయింపులో సూర్యాపేట మండల పరిధిలోని తాళ్లఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన మిర్యాల శ్రీధర్‌రెడ్డి, స్వాతి దంపతులకు రెండు మద్యం షాపులు దక్కాయి. వీరు తమ పేర్ల మీద రెండు దరఖాస్తులు చేసుకోగా.. డ్రాలో లక్కీగా వీరిద్దరికి రెండు మద్యం దుకాణాలు వచ్చాయి. సూర్యాపేట పట్టణంలోని షాప్ నంబర్ 4 స్వాతికి దక్కగా.. షాప్ నంబర్ 16 శ్రీధర్ రెడ్డికి దక్కింది.

క్లుప్తంగా

డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్‌కు నోటీసులు జారీ



రెడ్డీస్ ల్యాబ్ పరిశ్రమ సెక్యూరిటీకి నోటీసు అందజేస్తున్న పంచాయతీ సిబ్బంది

త్రిపురారం : అనుమతులు లేకుండా పరిశ్రమలో నిర్మాణాలు చేపట్టిన త్రిపురారం మండలం పెదద్దదేవులపల్లిలోని రెడ్డీస్ ల్యాబ్‌కు నోటీసులు జారీ చేసినట్లు సర్పంచ్ ఠాకూర్ బాలరాణి బాయి తెలిపారు. సోమవారం ఆమె స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. పంచాయతీ నుంచి అనుమతులు పొందకుండా డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ పరిశ్రమ యునిట్–5లో నిర్మిస్తున్న భారీ అక్రమ కట్టడాలు నిలిపివేయాలని నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. పంచాయతీ అనుమతి లేకుండా పరిశ్రమలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను నూతన పంచాయతీ రాజ్ చట్టం–2018 ప్రకారం కూల్చివేసే హక్కు పాలకవర్గానికి ఉంటుందన్నారు. నోటీసులు అందిన 7 రోజుల్లో పరిశ్రమలో నిర్మిస్తున్న నిర్మాణాల పత్రాలను పంచాయతీకి అందజేయాలని, లేని పక్షంలో తగు చర్యలు తీసుకుంటామన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థుల రాజకీయ ప్రస్థానం

అధికార బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల శంఖారావం పూరించింది. ఈ ఏడాది చివరిలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ సోమవారం విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే టికెట్లు ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థుల రాజకీయ ప్రస్థానం ఇలా..



సూర్యాపేట ఎమ్మెల్యే, మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట : మంత్రి జగదీష్‌రెడ్డి స్వగ్రామం నాగారం. ఆయన రాజకీయ ప్రస్థానం 2001 నుంచి ప్రారంభమైంది. తెలంగాణ రాష్ట్ర సాధనలో సీఎం కేసీఆర్‌తో ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. అప్పట్లోనే పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అధికార ప్రతినిధి పొలిట్ బ్యూరో మెంబర్‌గా కొనసాగారు.

- 2001: టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) పార్టీ సూర్యాపేట నియోజికవర్గ ఇన్‌చార్జి, సిద్దిపేట ఉప ఎన్నికలు ఇన్‌చార్జిగా పనిచేశారు.
- 2002 : మహబూబ్‌నగర్ పాదయాత్ర ఇన్‌చార్జి, జలసాధన (బ్రిగేడియర్) 45 రోజుల పాద యాత్ర ఆలంపూర్ నుంచి ఆర్‌డీఎస్)
- 2003 : మెదక్ ఉప ఎన్నికలు ఇన్‌చార్జి
- 2004 : సిద్దిపేట ఉప ఎన్నికలు ఇన్‌చార్జి (హరీష్ రావు ఎన్నిక)
- 2005:సదాశివపేట మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి
- 2006 : కరీంనగర్ ఉప ఎన్నికల ఇన్‌చార్జి
- 2008 : ముషీరాబాద్, ఆలేరు ఉప ఎన్నికల ఇన్‌చార్జితో పాటు మెదక్ జిల్లా ఇన్‌చార్జిగా వ్యవహరించారు.
- 2009: హుజూర్‌నగర్ ఎన్నికలు (ఎమ్మెల్యేగా పోటీ)
- 2009 : సూర్యాపేట నియోజికవర్గ ఇన్‌చార్జి
- 2010 : కాగజ్ నగర్ (ఆదిలాబాద్) బెజ్జూర్ ఇన్‌చార్జి
- 2011 : బాన్సువాడ నియోజికవర్గ ఉప ఎన్నికల ఇన్‌చార్జి
- 2012 : కొల్లాపూర్ ఉప ఎన్నికలు ఇన్‌చార్జి పరకాల ఉప ఎన్నికలు ఇన్‌చార్జి
- 2013 : నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి
- 2014–సూర్యాపేట శాసనసభ్యులుగా స్వతంత్ర అభ్యర్థి సంకినేని వెంకటేశ్వరరావుపై గెలుపొందారు. విద్యా శాఖ మంత్రి, విద్యుత్ శాఖ మంత్రిగా పనిచేశారు.
- 2018–సూర్యాపేట శాసనసభ్యులుగా కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిపై గెలుపొందారు, విద్యుత్ శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు.

కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ: బొల్లం మల్లయ్య యాదవ్ స్వగ్రామం నడిగూడెం మండలం కరివిరాల గ్రామం. యూత్ కాంగ్రెస్ నాయకుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన బొల్లం మల్లయ్యయాదవ్ 2005లో కోదాడకు వచ్చి కాంగ్రెస్ నాయకుడిగా పనిచేశారు.

- 2009లో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించినా రాకపోవడంతో కోదాడ నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి 13,544 ఓట్లను సాధించాడు.
- కాంగ్రెస్ నాయకుడు ఉత్తమ్‌తో వచ్చిన విభేదాలతో కాంగ్రెస్‌ను వీడి 2012లో తెలుగుదేశంలో చేరిక
- 2014లో టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావును కాదనే టీడీపీ ఇతనికి టికెట్ ఇచ్చింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతి ఉత్తమ్ చేతిలో 13,437 ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు.
- తెలుగుదేశం పార్టీ రాష్ట్రకార్యదర్శిగా నియమాకం
- 2018 ఎన్నికల్లో చివరి నిమిషంలో ఆయనకు టీఆర్ఎస్ టికెట్ లభించింది. ఈ ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మావతిపై 756 ఓట్ల తేడాతో విజయం సాధించాడు.
- తాజాగా రెండవసారి బీఆర్ఎస్ పార్టీ నుంచి టికెట్ పొందారు.

హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ ప్రస్తుత శాసన సభ్యులు శానంపూడి సైదిరెడ్డి స్వగ్రామం మఠంపల్లి మండలంలోని గుండ్లపల్లి. 2018 సాధారణ ఎన్నికలకు ముందు కెనడాలో వ్యాపారం చేసిన ఆయన తన తండ్రి పేరుతో అంకిరెడ్డి ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. ఫౌండేషన్‌తో పాటు సై యూత్ పేరుతో నియోజకవర్గంలోని యువతకు, నిరుద్యోగులుకు ఉద్యోగ అవకాశాల కోసం శిక్షణ ఇప్పించారు. 2018 సాధారణ ఎన్నికల్లో టీఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. ఎమ్మెల్యేగా గెలిచిన ఉత్తమ్ ఆతర్వాత పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా గెలిచారు. అనంతరం ఉత్తమ్ హుజూర్‌నగర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. దీంతో ఖాళీ అయిన హుజూర్‌నగర్ అసెంబ్లీ స్థానికి 2019లో జరిగిన ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతిపై టీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి గెలుపొందారు. ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

తుంగతుర్తి ఎమ్మెల్యే కిషోర్‌కుమార్

తిరుమలగిరి (తుంగతుర్తి) : తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ స్వస్థలం నల్లగొండ. బీఆర్ఎస్ విద్యార్థి విభాగంలో పని చేస్తూ ఓయూజేఏసీ వ్యవస్థాపక సభ్యుడిగా పని చేశారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అద్దంకి దయాకర్‌పై గెలుపొందారు. రెండవసారి 2018లో కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అద్దంకి దయాకర్‌పై విజయం సాధించారు.

దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ : ప్రస్తుత బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ స్వగ్రామం దేవరకొండ మండలం శేరిపల్లి. ఆయన రాజకీయ ప్రస్థానం 1997నుంచి ప్రారంభమైంది.అప్పటి నుంచి పలుమార్లు స్వగ్రామానికి సర్పంచ్‌గా, దేవరకొండ ఎమ్మెల్యేగా గెలుపోటములు చవిచూశారు. 20ఏళ్ల పాటు సీపీఐలో పనిచేసి 2016లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

- 1997, 2002లో రెండు పర్యాయాలు దేవరకొండ మండలం శేరిపల్లి గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అనంతరం 2004లో జరిగిన సాధారణ ఎన్నికల్లో సీపీఐ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందాడు.
- 2009లో ఎమ్మెల్యేగా సీపీఐ నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి బాలునాయక్ చేతిలో ఓటమి పాలయ్యారు.
- 2014లో సీపీఐ నుంచి ఎమ్మెల్యేగా రెండోసారి గెలుపొందాడు.
- 2016లో సీపీఐ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు.
- 2018లో బిఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి మూడవ సారి ఎమ్మెల్యేగా సమీప అభ్యర్థి బాలునాయక్‌పై భారీ మెజార్టీతో గెలుపొందాడు.
- 2022లో ముఖ్యమంత్రి కేసీఆర్ రవీంద్రకుమార్‌ను బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా నియమించారు.

నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ : నల్లగొండ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న కంచర్ల భూపాల్‌రెడ్డి స్వగ్రామం చిట్యాల మండలం ఉరుమడ్ల. భూపాల్‌రెడ్డి చిన్ననాటి నుంచే తండ్రి మల్లారెడ్డి నుంచి రాజకీయ ఓనమాలు నేర్చుకున్నాడు. నిజాం కాలేజీలో డిగ్రీ చదువుతున్న సందర్భంలో తెలుగు విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఆ తర్వాత నల్లగొండ జిల్లా తెలుగు యువత జిల్లా అధ్యక్షుడిగా సేవలు అందించారు. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి టికెట్ ఆశించారు. కానీ టికెట్ రాకపోవడంతో ఇండిపెంటెండ్‌గా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత 2018 ఎన్నికలకు ముందు కంచర్ల భూపాల్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు.

మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : నల్లమోతు భాస్కర్‌రావు మార్చి 18, 1953లో వరంగల్ జిల్లా నెక్కొండ మండలం, ముదిగొండ గ్రామంలో వెంకటరామయ్యలక్ష్మీకాంతమ్మలకు జన్మించాడు.

- మొట్టమొదటిసారిగా 1983లో నిడమనూరు మార్కెట్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు.
- 2014లో కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలోని మిర్యాలగూడ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎమ్మెల్యేగా పోటీ చేసి సమీప టీఆర్ఎస్ అభ్యర్థి అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డిపై గెలుపొందాడు.
- 2018లో ఇదే నియోజకవర్గం నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆర్.కృష్ణయ్యపై గెలుపొందాడు.

నాగార్జునసాగర్ ఎమ్మెల్యే భగత్

హాలియా : నాగార్జున సాగర్ నియోజకవర్గ ప్రస్తుత ఎమ్మెల్యే నోముల భగత్ స్వగ్రామం నకిరేకల్ మండలంలోని పాలెం గ్రామం. నోముల భగత్ రాజకీయ ప్రస్థానం 2014 నుంచి ప్రారంభమైంది. తన తండ్రి నోముల నర్సింహయ్య నాగార్జున సాగర్ నియోజకవర్గంలో 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు సాధారణ ఎన్నికల్లో క్రీయాశీలకంగా ఈయన పని చేశారు. నాగార్జున సాగర్ నియోజకవర్గంలో 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు జానారెడ్డిపై బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన నోముల నర్సింహయ్య గెలుపొందారు. ఆ తరువాత నోముల నర్సింహయ్య హఠాన్మరణం చెందడంతో 2011లో సాగర్ నియోజకవర్గానికి మరో సారి ఉప ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో నోముల నర్సింహయ్య తనయుడు నోముల భగత్‌కి బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డిపై గెలుపొందాడు. నాటి నుంచి నేటి వరకు నోముల భగత్ సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : ప్రస్తుత బీఆర్ఎస్ పార్టీ నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య స్వగ్రామం నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణ వెల్లంల. ఆయన రాజకీయ ప్రస్థానం 1995 నుంచి ప్రారంభమైంది. స్వగ్రామానికి ఎంపీటీసీగా, నార్కట్‌పల్లి మండల జెడ్పీటీసీగా, నకిరేకల్ ఎమ్మెల్యేగా గెలుపోటములు చవి చూశారు. 20ఏళ్ల పాటు కాంగ్రెస్‌లో పనిచేసి 2018 తరువాత ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి గెలిచి బీఆర్ఎస్‌లో చేరారు.

- 1995లో బ్రాహ్మణ వెల్లంల ఎంపీటీసీగా టీడీపీ నుంచి గెలిచి క్రీయాశీల రాజకీయాల్లో అడుగు పెట్టారు.
- కాంగ్రెస్‌లో చేరి 2001లో నార్కట్‌పల్లి జెడ్పీటీసీ గెలిచారు.
- 2009లో నియోజకవర్గ పునర్విభజనతో నకిరేకల్ అసెంబ్లీ స్థానం ఎస్సీ రిజర్వుడు కేటాయించడంతో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. ఎమ్మెల్యే పదవికి మొట్టమొదటగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి ప్రజలతో ఉద్యమంలో పాల్గొన్నారు.
- 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వీరేశం చేతిలో ఓటమి పాలయ్యారు.
- 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచి టీఆర్ఎస్ అభ్యర్థి వేముల వీరేషంపై విజయం సాధించారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరారు.

మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చౌటుప్పల్ : కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ప్రస్తుతం మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం లింగంవారిగూడెం ఆయన స్వగ్రామం. ఆయన రాజకీయ ప్రస్థానం 2003 నుంచి ప్రారంభమయ్యింది. అంతకు ముందు విద్యార్థి దశలో వామపక్ష ఉద్యమాల్లో ఉన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రసాధన ఉద్యమంలో చురుకుగా పని చేశారు. ఆ సమయంలో జరిగిన అనేక ఉప ఎన్నికలకు ఇన్‌చార్జిగా కూడా పని చేశారు.

- 2009 సంవత్సరంలో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చవిచూశారు.
- 2014లో నాటి టీఆర్ఎస్ అభ్యర్థిగా మునుగోడు అసెంబ్లీకి పోటీ చేశారు. సమీప ప్రత్యర్థిగా ఉన్న స్వతంత్ర అభ్యర్థి పాల్వాయి స్రవంతిపై విజయం సాధించారు.
- 2018లో రెండోసారి టీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. సమీప కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేతిలో ఓటమిపాలయ్యారు.
- 2022లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బీజేపీ నుంచి పోటీ చేసిన రాజగోపాల్‌రెడ్డిపై ప్రభాకర్‌రెడ్డి విజయం సాధించారు.

ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత

సాక్షి, యాదాద్రి : ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునితా మహేందర్‌రెడ్డి స్వగ్రామం యాదగిరిగుట్ట మండలం వంగపల్లి. 2001లో టీఆర్ఎస్ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరింది. అదే సంవత్సరంలో యాదగిరిగుట్ట ఎంపీటీసీగా గెలుపొంది ఎంపీపీగా ఎన్నికైంది. 2001 నుంచి 2006 వరకు ఎంపీపీగా, 2006 నుంచి 2011 వరకు వంగపల్లి సర్పంచ్‌గా, 2014లో ఎమ్మెల్యేగా తొలిసారిగా గెలిచి ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2018లో రెండో సారి విజయం సాధించి మరో సారి ప్రభుత్వ విప్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

పార్టీలో బాధ్యతలు : 2003లో టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శిగా, 2009 నుంచి 2014వరకు టీఆర్ఎస్ పొలిట్‌బ్యూరో సభ్యురాలుగా, 2010లో ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేశారు.

భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి : భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి స్వగ్రామం మోటకొండూరు మండలం నాంచారిపేట. బెంగళూరులో వ్యాపార రంగం నుంచి రాజకీయ రంగంలోకి అడుగుపెట్టారు. 2009 నుంచి స్వచ్ఛంద సేవా కార్యాక్రమాలు చేస్తూ ఆలేరు ఎమ్మెల్యేగా పోటీ చేయాలనుకున్నారు. అయితే ఆ ఎన్నికల్లో ఏ పార్టీ నుంచి టికెట్ లభించలేదు. దీంతో 2013నుంచి ఆలేరు నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఊరూర మంచినీటి కోసం బోర్లు, పైప్‌లైన్లు వేయించారు. అయితే అనూహ్యంగా ఆయనకు 2014లో కేసీఆర్ పిలుపు మేరకు టీఆర్ఎస్‌లో చేరిన ఆయనకు భువనగిరి అసెంబ్లీ టికెట్ లభించింది.2018లో రెండవసారి టీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం



పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ప్రైవేట్ బస్సు



మంగ్యా (ఫైల్)



రాధేశ్యాంరాత్రే (ఫైల్)



మృతుడు



వెంకన్న (ఫైల్)

- పలువురికి గాయాలు

వేములపల్లి : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందగా పలువురికి గాయాలయ్యాయి. ఉమ్మడి జిల్లాలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా విప్పనగండ్ల మండలం తూమ కుంటతండాకు చెందిన రాత్లావత్ మంగ్యా (40) ప్రైవేట్ వెంచర్లలో పనులు చేస్తూ నల్లగొండ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వెనుక ప్రాంతంలో గుడిసె వేసుకొని జీవిస్తున్నాడు. మంగ్యా మిర్యాలగూడ మండలంలోని కిష్టాపురం గ్రామ సమీపంలో గల ఓ వెంచర్‌లో పని నిమిత్తం సోమవారం ఉదయం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రాధేశ్యాంరాత్రే(38) మరో కార్మికుడు గణపతితో కలిసి బైక్‌పై కిష్టాపురానికి బయలుదేరారు. వీరు వేములపల్లి మండలం అన్నపురెడ్డిగూడెం స్టేజీ సమీపంలోకి రాగానే అదే సమయంలో చెన్నై నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు టైర్ పగిలి అదుపుతప్పింది. అనంతరం బస్సు రోడ్డు డివైడర్‌ను దాటి అవతలివైపు నుంచి వస్తున్న మంగ్యా బైక్‌ను వేగంగా ఢీకొట్టి పక్కనే ఉన్న పంటపొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో రాత్లావత్ మంగ్యా, రాధేశ్యాం రాత్రే అక్కడికక్కడే మృతిచెందగా గణపతికి తీవ్ర గాయాలయ్యాయి. బస్సులోని పలువురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గమనించిన స్థానికులు బస్సులో గాయపడిన ప్రయాణికులను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. రూరల్ సీఐ సత్యనారాయణ, వేములపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ప్రయాణికులను పలు వాహనాల ద్వారా వారి గమ్యస్థానాలకు తరలించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తూప్రాన్‌పేటలో గుర్తుతెలియని వ్యక్తి..

చౌటుప్పల్ : మండల పరిధిలోని తూప్రాన్‌పేట గ్రామం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. సీఐ ఎస్.దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం ... 40–45 సంవత్సరాల మధ్య వయసు గల గుర్తు తెలియని వ్యక్తి సోమవారం తెల్లవారుజామున హైవే వెంట హైదరాబాద్ వైపు నడుచుకుంటూ వెళ్తున్నాడు. అటు వైపే వెళ్తున్న గుర్తు తెలియని లారీ అతన్ని ఢీకొట్టగా అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడిని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో పని చేసే వ్యక్తిగా అనుమానిస్తున్నారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. మృతదేహాన్ని చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు దాటుతూ ఒకరు..

నకిరేకల్ : నకిరేకల్ శివారులోని పద్మానగర్‌కు చెందిన దేవులపల్లి వెంకన్న (50) ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో ఇంట్లో నుంచి బాబాసాహెబ్ గూడెం వైపు పెరుగు ప్యాకెట్ కోసం బయలుదేరాడు. పద్మనగర్‌జాతీయ రహదారి జంక్షన్ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొ ట్టింది. ఈప్రమాదంలో వెంకన్న తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు కుమారుడు ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుదీర్ కుమార్ తెలిపారు.

‘పేట’లో సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం



సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి చిత్రంలో మున్సిపల్ చైర్‌పర్సన్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి



షాపింగ్ మాల్‌లో మృణాల్ ఠాకూర్ సందడి

- జ్యోతి ప్రజ్వలన చేసిన మంత్రి జగదీష్‌రెడ్డి
- సందడి చేసిన సినీనటి మృణాల్ ఠాకూర్

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట జిల్లా కేంద్రంలో సీఎంఆర్ వారి 23వ బ్రాంచిని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ రిబ్బన్ కట్ చేయగా మంత్రి జగదీష్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం సినీ నటి, సీతారామం ఫ్రేమ్ మృణాల్ ఠాకూర్ మాల్ ప్రారంభోత్సవానికి వచ్చి సందడి చేశారు. అభిమానులు, పట్టణవాసులు ఆమెను చూసేందుకు భారీగా తరలివచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సూర్యాపేటకు రావడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. సిఎంఆర్ షాపింగ్ మాల్ కుటుంబంలో సభ్యురాలిగా ఉండడం ఆనందంగా ఉందని, ప్రతి ఒక్కరూ సీఎంఆర్‌ను ఆదరించాలన్నారు. పెద్ద పెద్ద నగరాలకు వెళ్లకుండా లేటెస్ట్ డిజైన్లలో పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ అందుబాటులో ఉండేలా వస్త్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మన్నికతో కస్టమర్లకు సీఎంఆర్ అందిస్తున్న సేవల కారణంగానే సూర్యాపేటలో 23వ బ్రాంచిని ఏర్పాటు చేయగలిగారని, మరిన్ని బ్రాంచీలు ఏర్పాటు కావాలని కోరుకుంటున్నానని తెలిపారు. సీఎంఆర్ చైర్మన్ మావూరి వెంకటరమణ, మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీలు మాట్లాడుతూ నాణ్యతకు మన్నికకు సీఎంఆర్ పెట్టింది పేరని, సరసమైన ధరల్లో నాణ్యమైన వస్త్రాలు అందించడం సంస్థ ఎదుగుదలకు కారణం అన్నారు. కార్యక్రమంలో 31వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిల దిలీప్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జిల్లా క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి శంకర్, పట్టణ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి కృపాకర్, సీఎంఆర్ అడ్వర్టైజింగ్ మేనేజర్ ఫణి, రమణమూర్తి పాల్గొన్నారు.



సూర్యాపేటలో అభిమానులకు అభివాదం చేస్తున్న మృణాల్ ఠాకూర్

తల్లి మందలించిందని యువకుడి బలవన్మరణం

భూదాన్‌పోచంపల్లి : తల్లి మందలించిందని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఉరేసుకుని బలవర్మణానికి పాల్పడ్డాడు. భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన జెట్ట శ్రీకాంత్(24) తన అన్న లింగస్వామితో కలిసి సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శ్రీకాంత్ మద్యానికి బానిసై మూడు నెలలుగా పనిచేయకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. దాంతో కుమారుడిని పద్మ మందలించింది. ఆదివారం రంగారెడ్డి జిల్లా రాపోలులో జరిగిన బొడ్రాయి పండుగకు బంధువుల ఇంటికి తల్లి, అన్న కలిసి వెళ్లారు. శ్రీకాంత్ ఇంటి వద్దనే ఉన్నాడు. ఒంటరిగా ఉన్న శ్రీకాంత్ ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. ఊరికి వెళ్లి సోమవారం ఉదయం వచ్చిన తల్లి, అన్నకు శ్రీకాంత్ చీరతో ఉరివేసుకుని వేలాడుతూ కన్పించాడు. వెంటనే వారు పోలీసులకు సమాచారం ఇవ్వగా పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆసుపత్రికి తరలించారు. మృతుడి అన్న లింగస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రజుమ్‌రెడ్డి తెలిపారు.

ఉరేసుకుని ఒకరు..

కోదాడరూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్‌కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లికి చెందిన కట్టా నాగేశ్వరరావు(35) కోదాడలో ఉంటూ ఓ వాటర్‌ప్లాంట్‌లో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిస కావడంతో భార్యపిల్లలకు అతనికి దూరంగా ఉంటున్నారు. ఒంటరి జీవితంతో పాటు మద్యానికి బానిసై రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పక్కన బంక్‌లో పనిచేసే వారు చూసి కుటుంబ సభ్యులకు , పోలీసులకు తెలిపారు. ఈ సంఘటనపై మృతుడి తండ్రి లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



మధు (ఫైల్)

నల్లగొండ క్రైం : అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటనర నల్లగొండ మండలం దండెంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. దండెంపల్లి గ్రామానికి చెందిన ముంత మధు(22) ఏసీ మెకానిక్‌తో పాటు వ్యవసాయపనులు చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉన్నాడు. మధు సోమవారం గ్రామంలోని చౌట వెంకటమ్మ చెరువు ఎగువ ప్రాంతంలో విగతజీవిగా పడి ఉండడాన్ని కాపరులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పక్కనే పురుగుల మందు డబ్బా ఉంది. బైక్ వారి సొంత వ్యవసాయ బావిలో పడి ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతదేహానికి నల్లగొండ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.